
కథ

# వానప్రస్థం

– వలివేటి నాగచంద్రావతి



"సరివిశెట్టి ఫోన్ చేశాడు ఇందాక" పడక కుర్చీలో వాలి పేపర్ తిరగేస్తున్న పరంధామయ్యగారు తల పైకెత్తి చెప్పారు.

వరండా ముందు చీడీల మీద కూర్చుని మనవరాలు మంజుల జుట్టు పాయలుగా తీసి నూనె పట్టిస్తోంది పార్వతమ్మ. "ఔనా, ఎలా ఉన్నారట. ఏమిటీ సంగతులు" అడిగింది క్యాజువల్‌గా.

"స్ట్రీట్ చిల్డ్రన్ కోసం కొత్త వింగేదో ప్రారంభించాట్ట. ఆ పిల్లల ఆటల్ని చూస్తూ మా తాతలూ బామ్మలందరూ చాలా ఉత్సాహంగా ఉంటున్నార్రా అంటున్నాడు" అన్నారు చిరునవ్వుతో.

"హ్హుఁ ఎవరి పిచ్చి వాళ్ళకానందం" అంది పార్వతమ్మ పెదవి విరుస్తూ.

"ఆశ్రమానికి మళ్ళా మనల్నొకసారి వచ్చి వెళ్ళమని పదేపదే ప్రాధేయపడుతున్నాడే పార్వతీ."

"ఎప్పుడూ పాడే పాటే కదా."

"వాడా ఆశ్రమానికి ఎన్ని హంగులేర్పరుస్తున్నాడో ఎలా తీర్చిదిద్దుతున్నాడో మనకు చూపించాలని వాడి తాపత్రయం. ఓసారి వెళ్ళి పది రోజులుండొస్తే పోలా" ఒప్పుకొమ్మన్నట్టు అన్నారు పరంధామయ్యగారు.

"భలేవారే, నాకెక్కడ కుదుర్తుంది చెప్పండి. ఎండలు ముదురుతున్నాయా, ఏటికి సరిపడా పప్పులవీ తెప్పించుకోవాలా, ఎండబెట్టించి డబ్బాలకెత్తించాలా, అన్నట్టు వడియాలవీ పెట్టుకునే పనొకటుంది కదా..."

"అవునవును. ఆ తరవాత ఊరగాయల కాలమొచ్చేస్తుందా... మిరపకాయల ముచ్చికలు తీసుకోవాలా" భార్య వెతికే సాకుల లిస్టుకి కొసగా తానొకటి జత చేస్తూ నవ్వారాయన.

ఆయనకు తెలుసు. భార్యకు అక్కడకు రావటం ఇష్టముండదని.

మొదట్లో ఒకసారి తీసుకువెళ్ళారు. వయసు మళ్ళబోతున్నా పార్వతమ్మలో యవ్వనపు చురుకుతనం తరగలేదు. లేచిన దగ్గర్నుంచీ ఆసులో కండెలా విరామం లేకుండా తిరుగుతూ, భర్తతో కొడుకులతో కబుర్లాడుతూ పనివాళ్ళకి పురమాయిస్తూ, కోడళ్ళకి సలహాలిస్తూ, మనవల్ని ముద్దు చేస్తూ గలగల్లాడుతూ తిరుగుతూ ఉండే పార్వతమ్మకా ఆశ్రమ నిశ్శబ్దం నచ్చలేదు. శిశిరంలో రాలబోయే పండుటాకుల్లాంటి ఆ ముసలివాళ్ళని చూస్తే ఒక విధమైన జలదరింపు కలిగిందామెకు. సత్తువలేని చేతులతో దేవుడి ముందు వాళ్ళు చేసే భజనలూ, నిరాసక్తంగా తప్పనిసరై వాళ్ళు చేసే పనులూ, నిరాశ నిండిన వాళ్ళ చూపులూ ఆమెను భయపెట్టాయి.

అప్పట్నుంచీ ఆశ్రమం పేరెత్తినా, వెడదామనన్నా, మల్లెచెట్టుకు ఆకులు గిల్లాలనీ... కోడలి వదినగారి చెల్లెలికి సమర్త సారె తీసుకువెళ్ళకపోతే బాగుండదనీ... ఇలాంటి చాలా చాలా ముఖ్యమైన విషయాలు గుర్తుకొస్తుంటాయామెకి.

తలపు మాత్రంగానే హడలు పుట్టినట్టు భుజాలు కుదించి వదిలిన భార్య విన్యాసం చూసి దీర్ఘంగా నిట్టూర్చారు పరంధామయ్యగారు.

"అయినా, ఈ ఇల్లూ నా బుజ్జి మనవలూ, వాళ్ళిచ్చే తియ్యతియ్యని ముద్దులూ... ఇవే నా స్వర్గం. వేరే నందనవనాలూ ఆశ్రమాలూ నాకెందుకు చెప్పండి" అంటూ వెనక్కి తిరిగున్న మనవరాలు మంజుల మొహాన్ని ఎదరకు తిప్పుకుని బుగ్గలు పుణుకుతూ "చెప్పరా చిట్టితల్లీ, తాత నన్నెక్కడికో రమ్మంటున్నారు... వెళ్ళనా మరి" అని అడిగింది ముద్దుముద్దుగా.

"ఒద్దు ఒద్దు, దాది నాది- తీసుకెళ్ళొద్దు" తల అడ్డంగా ఊపుతూ రెండు చేతులతోనూ పార్వతమ్మ మెడ పెనవేసి గారాలు పోయింది మంజుల. మురిసిపోయింది పార్వతమ్మ.

★ ★ ★

పరంధామయ్యగారి బాల్యమిత్రుడు సరివిశెట్టి. ఇద్దరూ ప్రాణ స్నేహితులే అయినా చిన్నతనం దాటాక ఎవరి అభిరుచులు వాళ్ళవీ ఎవరి దారులు వారివీ అయ్యాయి.

పరంధామయ్యగారేమో డిగ్రీ పూర్తి చేశాక తండ్రి చెప్పినట్టే బుద్ధిమంతుళ్ళా పెళ్ళి చేసుకుని తండ్రి చేస్తున్న కలప వ్యాపారంలో ఆయనకు సాయం చేస్తూ స్థిరపడిపోయారు.

సరివిశెట్టి అలాకాదు... చిన్నతనం నుంచీ అతనిది చాలా జాలి గుండె. దీనంగా ఎవరు కనబడినా కరిగిపోయేవాడు. అడిగితే తన దగ్గరున్నదేదయినా సరే తటపటాయించకుండా తీసి ఇచ్చేసేవాడు. స్కూలుకి వెళ్ళే తోవలో ఆకలన్న బిచ్చగాడికి తన క్యారేజీ ఇచ్చేసిన రోజులెన్నో.

ఎదిగేకొద్దీ ఆ ఉదారతా సేవాగుణం పెరిగిందేగానీ తరగలేదు. వరదలొచ్చి అనాథలైన వారికీ, ఇల్లూ వాకిలీ ఆగ్గిపాలయి నిరాశ్రయులైన వారికీ ముందుగా వెళ్ళి అండగా నిలబడేది ఇతనే. చందాల కోసమో సహాయ కార్యక్రమాలంటూ వాటి నిర్వహణ కోసమో విరామం లేకుండా తిరుగుతూనే ఉండేవాడు. ఈ వ్యాపకాల మూలంగా చదువు వెనకబడింది. పెళ్ళి చేస్తే దారికొస్తాడనుకుంటే అటువంటి బంధాల మీద తనకి ఆసక్తిలేదని నిర్ద్వంద్వంగా చెప్పేశాడు.

తల్లిదండ్రుల మరణానంతరం పూర్తిగా స్వతంత్రుడయ్యాడతను. 'ఈ సమాజం నాకేమిచ్చింది అని ప్రశ్నించే బదులు, ఈ సమాజానికి నేనిది చేశాను' అని చెప్పగలగాలని మనస్ఫూర్తిగా నమ్మేవాడు.

వయసు ఉడిగి, చరమాంకంలో ఆప్తులను కున్నవారి ఆదరణ లుప్తమయి, ఏకాకుల్లా మిగిలిపోయిన వృద్ధులను ఆదరాభిమానాలతో అక్కున చేర్చుకోవాలనే అతని సంకల్పానికి సాకారం ఆ వృద్ధాశ్రమం. అది అతని ప్రాణం. తన యావదాస్తినీ వెచ్చించి నిర్మించిన వృద్ధుల ఆనందధామం. ఆ ముసల్లి వారి కోసం ఏ సౌకర్యాలు అమర్చినా ముందు పరంధామయ్యగారికి చెప్పి ఆనంద పడతాడు. చెప్పటం కాదు ప్రతీదీ మిత్రుడికి ప్రత్యక్షంగా చూపించాలని అతని అభిలాష.

కానీ పార్వతమ్మకి అక్కడికి వెళ్ళటమంటేనే ఇష్టముండదు. భార్య లేకుండా పరంధామయ్యగారెక్కడికీ కదలరు.

★ ★ ★

పరంధామయ్య, పార్వతమ్మ గార్లది అన్యోన్యమైన దాంపత్యం. పాడికుండ లాంటి సంసారం - పండంటి బిడ్డలు.

పెద్దవాడు రమేష్ డిగ్రీ చేసి వ్యాపారం మీద ఇష్టంతో తండ్రితోనే ఉండిపోయాడు. చిన్నవాడు సురేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కడసారపు గారాలపట్టి శకుంతల. ఇద్దరు కొడుకులకూ వివాహం చేసేశారు. పెద్దవాడు రమేష్‌కి ఇద్దరు పిల్లలు. చిన్నవాడు సురేష్‌కీ ఇద్దరే. శకుంతలకు యుక్త వయసొచ్చింది.

భార్య అంటే ఎనలేని ప్రేమ పరంధామయ్యగారికి. ఆమె సన్నిధి ఆయనకో ఆరామ మందిరం. ఎంత చికాకులో ఉన్నా ఆమెను చూస్తే ప్రసన్నుడవుతాడాయన. ప్రతి చిన్న విషయాన్నీ- వ్యాపార లావాదేవీలతో సహా- ఆమె చెవిన వేయాల్సిందే. వచ్చిన ఆదాయం ప్రతి పైసా ముందు భార్య చేతిలో పెట్టాల్సిందే. ఆ ఇంటికి మహారాణి పార్వతమ్మ.

భర్తకే కాదు, కొడుకులిద్దరికీ కూడా తల్లంటే పంచప్రాణాలు. అమ్మ ఎప్పుడూ వాళ్ళ కళ్ళకి మహాలక్ష్మిలా పెద్దపెద్ద జరీ చీరెలు కట్టుకుని తలనిండా పూలు పెట్టుకుని కళకళలాడుతూ కనిపించాలి. అన్నపూర్ణలా తన హస్తాలతోనే అందరికీ వడ్డించాలి. ఆమె ఇంట్లోంచి కాలు కదపాలంటే కారు ఉండాల్సిందే. అంత అపురూపం వాళ్ళకి.

కోడళ్ళకు అమ్మ తరవాత అమ్మ పార్వతమ్మ. మాటల్లోనే కాదు అభిమానంలో కూడా. కల్లో కూడా అత్తగారు గీచిన గీటు దాటాలనుకోరు వాళ్ళు.

కోరికోరి తన ఇష్టానుసారం కట్టించుకున్న భవంతి. నెత్తిన పెట్టుకునే భర్త. ప్రేమానురాగాలు కురిపించే పరివారం. వనంలో చిలకల్లా సందడి చేస్తూ, ఆనందపరిచే చిన్న పాపలు. ఇదే ఆమె ప్రపంచం. ఈ బృందావనాన్ని విడిచి ఎక్కడికీ వెళ్ళాలనుకోదు పార్వతమ్మ. ముఖ్యంగా ఆశ్రమం లాంటి నీరవ నిశ్శబ్దంలోకి.


★ ★ ★

లేత పచ్చిక మీద వాకింగ్ చేస్తున్నట్టు కులాసాగా అడుగులు వేస్తున్న విధి ఉన్నట్టుండి తిక్కరేగినట్టు రూటు మార్చింది.

నిండుగా కలప దుంగలతో తమ అడితీకి వస్తున్న లారీ పక్కకి ఒరిగిపోయి, పైనున్న ముగ్గురు కూలీలు దొర్లిన ఆ దుంగలకింద పడి నుగ్గునుగ్గు అయ్యారన్న వార్త విన్న పరంధామయ్యగారు గుండె పట్టినట్టయి కుప్పకూలిపోయారు. మరి లేవలేదు.

పరంధామయ్యగారు మరణించారు. చూస్తూ చూస్తూ ఉండగానే కళ్ళముందు కాస్తున్న వెన్నెల కరిగిపోయి గాఢాంధకారం అలుముకుంది పార్వతమ్మకు.

రోజులూ వారాలూ నెలలూ గడిచాయి.



మెల్లమెల్లగా ఆ చీకటి తెరలు తొలగించుకుని ఇవతలకు రాక తప్పలేదు, వచ్చింది. చుట్టూరా కలయజూసింది. ఆ ఇల్లూ ఆ మనుషులూ ఆ వాతావరణమూ ఏవీ మారనట్టుగానే ఉన్నాయ్. కానీ అన్నీ మారిపోయినట్టుగానూ ఉన్నాయ్.

వరండాలో వేసిన వాలుకుర్చీ వేసినట్టుగానే ఉంది- దాన్లో కూర్చుని పేపరు చదువుకుంటూండే పరంధామయ్యగారు లేరు. పెరటిగుమ్మం ఎదురుగా ఆమె నాటిన తులసిమొక్క అలాగే ఉంది- కానీ తను కట్టించిన సిమెంటు కోటలో కాదు, కోడలు కొనుక్కొచ్చిన పాలరాతి కోటలో. పనిమనిషి దుర్గమ్మ అమ్మగారూ అనే పిలుస్తోంది- కానీ పార్వతమ్మని కాదు, కోడలు మీనాక్షిని. ప్రహరీగోడ మీంచి రోజూ ఏవేవో బదుళ్ళడిగే పక్కింటి మంగమ్మగారి మనవరాలు పార్వతమ్మ కనబడినా ఆమెను అడగటం లేదు - 'మీనాక్షీ మీనాక్షీ' అని కోడల్ని అరిచి పిలుస్తూ ఉంది.

ఇదివరలో డైనింగ్ టేబుల్ ముందు పార్వతమ్మా పరంధామయ్యగారూ కూర్చునే కుర్చీల్లో మరి ఎవరూ కూర్చునేవారు కాదు. అది భయంతో కాదు... ఒక మర్యాద, గౌరవం. ఇప్పుడది అడుగంటింది. ఆ కుర్చీల్ని ఆక్రమించుకోగలిగే ధైర్యం ఇంట్లో అందరికీ వచ్చేసింది. భోజనాలు పార్వతమ్మే వడ్డించాలనే నియమం కూడా ఇప్పుడు కొండెక్కేసింది.

తల్లి నవ్వుతూ ఎదురొస్తే తప్ప గడప దాటని కొడుకు, ఇప్పుడు బయటకు వెళ్ళే ముందు ఆమె కనిపిస్తే ఇబ్బందిపడుతున్నట్టు ముఖం చిట్లిస్తున్నాడు. నానమ్మ కనబడగానే కాళ్ళు చుట్టేసుకునే పిల్లలు కూడా ఇప్పుడంతగా దగ్గరకు రావటం లేదు... బహుశా కుంకుమ లేక బోసిపోయిన వదనం, మలినమై నలిగిపోయిన చీర, సంస్కారంలేని తలకట్టుతో కళావిహీనంగా ఉన్న ఆమెను చూసి, తడబడుతూనో బెదురుతూనో వెనకడుగేస్తున్నారేమో.

పిల్లలు మొహాలు తిప్పుకుంటున్నారు సరే- పెద్దల వైఖరిలోనూ నిర్లక్ష్యం వ్యక్తమవుతోంది కొట్టవచ్చినట్టుగా.

మూణ్ణెళ్ళకొకసారి మంగళగిరి నుంచీ కేవలం పార్వతమ్మ కొరకే చీరల మూటలు తీసుకువచ్చే వ్యాపారితో 'అంత ఖరీదు చీరలు కట్టుకునే వాళ్ళెవరూ ఇప్పుడు లేరులెండి. సాదా చీరలు ఉంటే తీసుకురండి' అని చెబుతోంది మీనాక్షి. కర్ణకఠోరంగా... (printed: క[ట్రాటయి వింది పార్వతమ్మ.)

మొన్నమొన్నటి వరకూ ఆ ఇంట్లో సర్వత్రా తానై ఉండే పార్వతమ్మకిప్పుడు ఏ ప్రాధాన్యతా లేదు. తను లేకపోతే క్షణం కదలదనుకున్న కాలం ఇప్పుడు నువ్వెవరివన్నట్టు తల ఎగరేసి ముందుకు పరుగులు పెడుతోంది.

★ ★ ★

ఆరోజు పెద్దకొడుకు రమేష్ అడితీకి వెళుతూ తల్లి దగ్గరకు వచ్చాడు. "అమ్మా, ప్రతి చిన్నదానికీ నీ సంతకం కోసం రావాలంటే, అన్ని పనులూ ఆలస్యమైపోతున్నాయ్. దీన్ని పవరాఫ్ అటార్నీ అంటార్లే... ఇక్కడో సంతకం చెయ్యి, మిగతా అంతా నేను చూసుకుంటాను" అన్నాడు కొంత విసుగ్గా మొహంపెట్టి.

పార్వతమ్మ పెళ్ళినాటికి మామగారు ఈ కలప వ్యాపారాన్ని చాలా చిన్న స్థాయిలో నడిపిస్తూండేవారు. కొడుకుని కూడా అందులోనే దించేసరికి- అది మరీ చిన్నగా, ఇద్దరు మనుషులకది చాలదన్నట్టుగా అనిపించేది. వ్యాపారాన్ని విస్తరించాలనీ ఫర్నిచర్ షాపుని కూడా ప్రారంభించాలనీ ఎన్నో ప్రణాళికలు ఉండేవి తండ్రీ కొడుకులకి. కానీ అది అమలుచేయాలంటే పెట్టుబడి కొరత.

పార్వతమ్మ కాపురానికి వస్తూనే ఆ విషయం గ్రహించుకుంది. ఇక ఆట్టే ఆలోచించలేదామె. తను మెట్టిన ఈ ఇల్లే తనకు శాశ్వతం. ఆ కుటుంబంలోవాళ్ళే తన

స్వజనం. పాలు పొంగినట్టు సంసారం పొంగితే తనదే ఆ అదృష్టం అనుకుంది. పసుపూ కుంకుమల కింద తండ్రి ఇచ్చిన అయిదెకరాల మాగాణీ అమ్మించేసి, మామ గారి దోసిట్లో పోసింది పార్వతమ్మ. ఆమె ఇచ్చిన వేళ మంచిదై, మొక్క పాతితే వృక్షమైనట్టు బిజినెస్ బాగా వృద్ధి చెందింది. లక్షల్లో ఉన్న వ్యాపారం కోట్లకు ఎగబాకింది.

తమ పెరుగుదలకు నిచ్చెన వేసిన కోడలంటే అపరిమితమైన వాత్సల్యం మామ గారికి. ఆమె మాటకి చాలా విలువ ఇచ్చే వారాయన. ఆ అభిమానంతోనే మరణించే ముందర కొడుకుతోపాటు వ్యాపారంలోనూ ఆస్తిలోనూ కూడా కోడల్ని భాగస్వామిని చేస్తూ విల్లు రాయించారు. అందువల్ల బ్యాంకు పనులకిగానీ బిజినెస్ వ్యవహారాల్లో గానీ తరచూ పార్వతమ్మ సంతకం అవసరమవుతూ ఉంటుంది.

ఇప్పటి వరకూ భార్యతో ఎప్పుడు సంతకం చేయించుకోవాల్సి వచ్చినా ఏ రోజూ చిన్నతనం ఫీలవలేదు పరంధామయ్యగారు.

'కొడుకిప్పుడు పెద్దవాడయ్యాడు. ఓ చిన్న సంతకం కోసం తల్లి ముందర అయితేనేమి- చేతులు కట్టుకుని నించోవటం నామోషీనే కద'. మాట్లాడకుండా కొడుకు చెప్పినచోట సంతకం చేసింది పార్వతమ్మ.

ఆ మరుసటివారం తండ్రి మాసికానికని సురేష్ కుటుంబంతో సహా వచ్చాడు. ఎవరు చెవిలో ఊదారో తెలీదు- "ఎవర్నడిగి సంతకం చేశావ్, అంతా నీ ఇష్టమేనా?" అని ఎగిరాడు తల్లి మీద. "నేను లేకుండా చూసి ఇట్లాంటి పని చేస్తావా" అని అన్నగారితో పోట్లాడాడు. ఏకోదరులిద్దరూ తరతరాలనాటి శత్రువుల్లా తిట్టుకున్నారు.

"ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో" అన్నాడు పెద్దవాడు.

"కోర్టులోనే తేల్చుకుందాం" అన్నాడు చిన్నవాడు.

వెళ్ళేముందు చిన్నకోడలు వకుళ పార్వతమ్మ దగ్గరకొచ్చింది. "అత్తమ్మా, వచ్చే వారంలో మా చెల్లి పెళ్ళి. పట్టుచీర మీదికి మీ కాసులపేరయితే నిండుగా ఉంటుంది" అంది గోముగా.

ఇనప్పెట్టె తెరిచింది పార్వతమ్మ. కాసుల పేరు, ముత్యాల సరాలు... 'మమ్మల్ని మరిచిపోయావ్' అన్నట్టు ఆభరణాలన్నీ తళతళ్లాడుతూ పలకరించినయ్. వాటిమీద చెయ్యివేసి నిమిరింది పార్వతమ్మ.

బంగారంలో రాళ్ళు పొదిగిన వట్టి నగలా. అవి... కాదు, ఎన్నో మధురస్మృతుల్ని దాచుకున్న అపూర్వ గనులు. విలువ కట్టలేని నిధులు.

తన నిశ్చితార్థం రోజున వంటినిండా బోలెడు నగలు దిగేసుకున్నా అవి చాలవన్నట్టు తన అత్తగారు ఆమె నడుముకున్న ఈ మువ్వల వడ్డాణం తీసి తన నడుముకు పెట్టి, 'ఇప్పుడు అచ్చం లక్ష్మీదేవిలా ఉన్నావ్' అంటూ నిలువెల్లా చూస్తూ మురిసిపోయింది.

కాసులపేరు తన నాయనమ్మది. అంత భారీగా మోటుగా ఉన్న ఆ కాసులపేరు 'నేను వేసుకోను' అని ఎంత మొరాయించినా ప్రతి పండక్కీ అది తన మెళ్ళో వేసేది నాయనమ్మ. పోయేటప్పుడు కూడా 'కాసుల పేరు నా పెద్ద మనవరాలికే సుమా' అని చెప్పి మరీ కన్నుమూసిందట.

అరవంకీలు రెండూ తన మేనత్త కానుక. కొడుక్కి తనను ఇవ్వలేదని అలిగి, తన పెళ్ళికి రానేలేదావిడ. వంకీలు మాత్రం భర్త చేతికిచ్చి పంపించింది.



'కోడలిగా నా ఇంటికొచ్చిన రోజున నీకీ అరవంకీలు బహుమతిగా ఇవ్వాలని చేయించానెప్పుడో. కోడలివి కాకపోయినా అవి నీవే' అని చెప్పమన్నదట... పిచ్చిది. 'పైకి కోపం గానీ కడుపులో అంతా నీమీద ప్రేమేరా తల్లీ' అన్నారు నాన్న కళ్ళు చెమ్మగిల్లుతోంటే.

ఫర్నిచరు షాపు తెరిచిన ఏడాది- వచ్చిన లాభంతో డైమండ్ నెక్లెస్ చేయించి అది పెట్టుకున్నప్పుడల్లా 'పేరుకు తగ్గట్టు ఉన్నావమ్మా' అనేవారు మామగారు. కెంపుల హారం భర్త చేతితో తానందుకున్న తొలి ప్రేమకానుక.

'ఏ నగ తాకినా ఒక తీపి జ్ఞాపకాన్ని జ్ఞాపకం చేస్తోంది. ఇప్పటివరకూ ప్రాణప్రదంగా చూసుకున్నదివన్నీ. కానీ, ఈ ఆభరణాలకే తలమానికమనుకున్న ఆభరణాన్ని భగవంతుడు లాగేసుకున్నాక వీటితో తనకేం అవసరముంది?'

నిర్లిప్తంగా కాసులపేరు తీసిచ్చింది కోడలికి.

మర్నాడు... కచ్చితంగా మర్నాడే అత్తగారి దగ్గరకొచ్చింది పెద్దకోడలు. "బుజ్జి లోలాకులు మెరుగు పెట్టించటానికి జ్యూయలరీ షాపుకెడుతున్నాను. మీ వడ్డాణం మువ్వలు కొన్ని ఊడాయన్నారుగా, ఇలా ఇవ్వండి అతికించుకొస్తాను" అంది. అడిగినట్టుగా ఉంది మాట- ఆజ్ఞాపిస్తున్నట్టుగా ఉంది స్వరం. వడ్డాణం తీసి కోడలికి అందించింది పార్వతమ్మ. అది ఇక తిరిగి రాదని తెలుసు.

ఆవిడటు వెళ్ళగానే కాళ్ళు నేలమీద గట్టిగా తాటించుకుంటూ వచ్చింది కూతురు శకుంతల. "అన్నీ వాళ్ళకే ఇచ్చేశావ్, ఇక నాకేమి మిగిల్చావ్... నువ్వసలు తల్లివేనా? నాన్నుంటే ఇలా చేసేవారా? నా కూతురు నా కూతురు అంటావ్‌గానీ నీ ప్రేమంతా నటన" అంది.

కూతురు చెరుగుతున్న దూషణలన్నీ కన్నార్పకుండా చూస్తూ వింది పార్వతమ్మ. మెల్లగా మరోసారి ఇనప్పెట్టె తెరిచి చిన్న సూట్‌కేసు ఇవతలికి తీసింది.

"చూడమ్మా, మీ నాన్న నీ పేర కొన్న ఆస్తుల దస్తావేజులివి. నువ్వు పుట్టిన దగ్గర్నుంచీ నీకని కొని దాచిన నగలివి, జాగ్రత్త చేసుకో" అంటూ శకుంతలకు అందించింది.

వెలవెలబోయింది శకుంతల మొహం. కానీ సూట్‌కేసు అందుకోవటం మాత్రం మానలేదు.

★ ★ ★

మిత్రుణ్ణి కడసారిచూపు చూసి వెళ్ళిన సరివిశెట్టిగారు పార్వతమ్మగారిని మరోసారి పరామర్శించుదామని వచ్చారు.

ఆయన వచ్చిన రోజునే సురేష్ కూడా వచ్చాడు... అన్నగారితో ఆస్తి విషయం అటో ఇటో తేల్చుకుని కోర్టులో దావా పడెయ్యాలని.

విస్తుపోయారు సరివిశెట్టిగారు వ్యవహారమంతా విని. ప్రశాంత కాసారంలా ఉండే ఇంటిని తండ్రి కన్ను మూయగానే వీధిన పడేసినందుకు చాలా బాధపడ్డాడాయన.

అన్నదమ్ములిద్దర్నీ గట్టిగా మందలించారు. అదృష్టవశాత్తూ సరివిశెట్టిగారంటే భక్తీ గౌరవాలున్నాయ్ వాళ్ళకి. అంచేత 'నువ్వేమిటీ మాకు చెప్పేది' అనకుండా తలలు వంచుకున్నారు.

ఏమి పంచుకోవాలన్నా సామరస్యంగా తేల్చుకోమనీ తల్లిని గౌరవంగా చెల్లెల్ని ఆదరంగా చూసుకోమనీ తండ్రి పేరు చెడగొట్టవద్దనీ బుద్ధులు చెప్పారు. తలలూగించారిద్దరూ.

వెళ్ళేముందు పార్వతమ్మను పిలిచారు- 'వెళ్ళొస్తాను, ధైర్యంగా ఉండు' అని చెప్పాలని.

ఎప్పుడు సర్దుకున్నదో చేతిలో సూట్‌కేసుతో నిలబడి ఉంది పార్వతమ్మ. "పదండి అన్నయ్యగారూ, నేనూ వస్తున్నాను- వానప్రస్థానికి" అంది అన్ని బంధనాలూ విడిపోయిన సన్యాసినిలా నిర్లిప్తంగా.

అవును, ఆ ఆశ్రమం పేరు 'వానప్రస్థం'. ★



24